
క్లుప్తంగా

రేపు ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు రాక

ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బుల సంబంధిత వ్యాధులకు చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలకు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



వీరేష్

కమలాపురం : స్థానిక పీవీఎస్ఆర్ఎం జూనియర్ కళాశాలకు చెందిన కే వీరేష్ ఖో-ఖో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ఫిజికల్ డైరెక్టర్ ఖాదర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న వీరేష్ ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు కాణిపాకంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. కాగా ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు ఉత్తర్ ప్రదేశ్‌లోని ఆలిఘడ్‌లో జరిగే 43వ జూనియర్ నేషనల్ ఖో-ఖో ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. కాగా కళాశాల చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వీరేష్‌ను, పీడీ ఖాదర్‌రెడ్డిని అభినందించారు. ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

ముద్దనూరు : స్థానిక రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి, సభ్యులు రైల్వేస్టేషన్‌లో వున్న అనాథలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఏటా చలికాలంలో అనాథలకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఇచ్చినమాట నిలబెట్టుకోవాలి

జమ్మలమడుగు : ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు వలంటీర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగించడంతోపాటు వారికి ప్రతి నెల రూ.10 వేలు జీతం ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు శాసనమండలిలో మంత్రి డోల బాల వీరాంజనేయులు వలంటీర్లు లేరు అనడం ఏంటన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వెంటనే వలంటీర్ వ్యవస్థను కొనసాగించి వారికి ప్రతినెల రూ.10 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్మికులను మరచిపోతే మూల్యం తప్పదు

జమ్మలమడుగు : సర్వ సంపదలు సృష్టించేది కార్మికులు, కర్షకులేనని వారిని ప్రభుత్వాలు మరచిపోతే మూల్యం తప్పదని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు దాసరివిజయ్, కార్యదర్శి ఏసుదాసులు తెలిపారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్డీఏ కూటమి పన్నుల్లో రాయితీలు, ప్రోత్సాహకాలు అంటూ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారు. ప్రస్తుతం రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నార న్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26వ తేదీన కడప కలెక్టరేట్ వద్ద ర్యాలీ, సభలను నిర్వహిస్తున్నామని కార్మికులు, రైతులు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

పాఠశాలల పని వేళలు పెంపు సరికాదు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టనున్న పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయం తక్షణం ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కడప జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షిని తమ కార్యాలయంలో ఆపస్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల పని సమయం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొడిగించడం వల్ల ఉపాధ్యాయులే కాకుండా విద్యార్థులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

పంటలకు డ్రోన్ ద్వారా మందుల పిచికారి

- సాగులో ఖర్చుతోపాటు సమయం ఆదా
- అన్ని రకాల పంటలకు పిచికారి చేసుకునే అవకాశం
- గ్రామాల్లో ఆసక్తి చూపుతున్న రైతులు



చామంతి తోటలో పురుగు మందు పిచికారి చేస్తున్న డ్రోన్

వేముల : గ్రామీణ ప్రాంత రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులవైపు అడుగులు వేస్తున్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలుకుతూ అధునాతన పద్ధతులకు అలవాటుపడుతున్నారు. వ్యవసాయంలో నూతన టెక్నాలజీని ఉపయోగించుకుని అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నారు. సాగు చేసిన పంటలకు తెగుళ్లు సోకినట్లయితే డ్రోన్ ద్వారా మందుల పిచికారి చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీని ద్వారా సకాలంలో సత్వరమే పిచికారి చేసేందుకు వీలుంది. పంటల సాగులో పెట్టుబడులు పెరిగిపోయి దిగుబడులు తగ్గడంతో రైతులకు వ్యవసాయంలో నష్టాలు వస్తున్నాయి. నష్టాలను అధిగమించి ఆదాయం ఆర్జించేందుకు రైతులు నూతన టెక్నాలజీని ఉపయోగించుకుంటూ ఆ దిశగా ముందుకు వెళుతున్నారు.

మందుల పిచికారికి దొరకని కూలీలు

పంటలు సాగు చేశాక వాటి సంరక్షణ ఎంతో కీలకం. పంటలు సాగు చేసిన 20 రోజుల నుంచే మందులను పిచికారి చేయాల్సి వస్తోంది. ఇందుకు మందుల పిచికారి చేసేందుకు కూలీలు దొరకడంలేదు. పంటలు సాగు చేశాక ఎన్ని రోజులకు మందు పిచికారి చేయాలో ఆ సమయానికి మందులను పంటలకు పిచికారి రైతులు చేయలేకపోతున్నారు. ఇందుకు కూలీలు దొరకకపోవడమే. సకాలంలో మందులు పిచికారి చేయకపోతే సాగులో నష్టాలను చవిచూస్తున్నామని రైతులు అంటున్నారు. అంతేకాక కూలీలతో మందులను పిచికారి చేయడం ఖర్చుతో కూడుకుంటోంది. దీంతో సాగులో పెట్టుబడులు పెరిగి దిగుబడులు అందక రైతులు నష్టపోతున్నారు.

సాగులో ఖర్చుతోసాటు సమయం ఆదా

పంటల సాగులో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా సాగులో ఖర్చుతోపాటు సమయం ఆదా అవుతోంది. దీని ద్వారా అనుకున్న సమయానికి పంటలకు మందులను పిచికారి చేయవచ్చు. ఇందుకు ఎకరాకు కేవలం రూ.500లు తీసుకుంటున్నారు. అదే కూలీతో మందు పిచికారి చేసేందుకు ఎకరాకు రూ.800లు ఖర్చు, ఎక్కువ సమయం అవుతోందని రైతులు అంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంత రైతులు డ్రోన్ ద్వారా పిచికారి చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

అన్ని రకాల పటలకు పిచికారి :

సాగులో ఉన్న అన్ని రకాల పంటలకు డ్రోన్ ద్వారా మందులను పిచికారి చేసుకోవచ్చు. దీనివలన పంటలకు పిచికారి చేసిన మందులు బాగా పనిచేస్తాయని రైతులు అంటున్నారు. ముఖ్యంగా అరటికి ఎక్కువగా సిగటోకా తెగులు సోకుతుంది. అరటిలో కూలీల సహాయంతో మందులు పిచికారి చేయడం కష్టమవుతోంది. అదే డ్రోన్ సహాయంతో అరటికి మందులను పిచికారి చేయడం ద్వారా సకాలంలో తెగుళ్లను నివారించవచ్చు. ఇప్పుడిప్పుడే రైతులు డ్రోన్ ద్వారా పురుగు మందులను పిచికారికి మొగ్గు చూపుతున్నారు. రాబోవు కాలంలో ఎక్కువ భాగం రైతులు డ్రోన్ ద్వారా పురుగు మందులను పిచికారి పై దృష్టి పెట్టనున్నారు. డ్రోన్ ద్వారా తక్కువ డోస్‌తో మందులను పిచికారి చేయడం కేవలం ఎకరా పంటకు 10 నిమిషాలలో పూర్తవుతుంది. డ్రోన్ ద్వారా రైతులకు సమయం, ఖర్చు ఆదా అవుతున్నాయి.



అరటి పంటకు డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారి చేయిస్తున్న రైతు

సకాలంలో తెగుళ్లను నివారించవచ్చు



పంటలకు డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారి చేయడంవల్ల సకాలంలో తెగుళ్లను నివారించవచ్చు. పవర్ స్ప్రేయర్‌తో పిచికారి చేస్తే పురుగు మందుల డోస్ పెంచుకోవాలి. అదే డ్రోన్ ద్వారా పిచికారి చేస్తే తక్కువ డోస్ పురుగు మందు అవసరమవుతుంది. అదే డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారి చేయడంవల్ల పంటలకు బాగా తడపవచ్చు.

– చంద్రమోహన్‌రెడ్డి, రైతు. గొందిపల్లె

రైతులు ఆ దిశగా మొగ్గు చూపాలి



పంటల సాగులో తెగుళ్ల నివారణకు పురుగు మందులు డ్రోన్ ద్వారా పిచికారి చేయాలి. ఆ దిశగా రైతులు మొగ్గు చూపాలి. ముఖ్యంగా అరటికి సోకే తెగుళ్ల నివారణకు డ్రోన్ ద్వారా పిచికారి చేయడం ఎంతో మేలు. అరటిలో పవర్ స్ప్రేయర్ ద్వారా కూలీ సహాయంతో పురుగు మందులు పిచికారి చేయడంవల్ల ఉపయోగంలేదు. రైతులు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి.

– రాఘవేంద్రారెడ్డి, హెచ్ఓ. పులివెందుల

మెమోలు జారీ

కమలాపురం : స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలకు సంబంధించి బాధ్యులైన ఇద్దరు అధ్యాపకులకు మెమోలు జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ తులశమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులుగా పత్రికల్లో వస్తున్న కథనాలకు స్పందనగా తాను ఈ విషయాలను వెల్లడిస్తున్నానని ఆమె తెలిపారు. తమ కళాశాలలో జరుగుతున్న విషయాలపై ఉన్నతాధికారులకు సమాచారం ఎప్పటికప్పుడు నివేదిస్తున్నాన్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు ఘటనలకు కారణమైన ఇద్దరు అధ్యాపకురాళ్లపై మెమోలు జారీ చేశామని, తాను విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నానని, ఉన్నతాధికారుల నిర్ణయాలకు అనుగుణంగా నడుచుకుంటానని ఆమె తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ



పరిసరాల పరిశుభ్రతలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : మండలంలోని ప్రొఫెసర్స్ కాలనీలో కడప మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మిరెడ్డి ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మలేరియా, డెంగీ జ్వరాల గురించి కరపత్రాలు ద్వారా ప్రజలకు అవగాహన కలిప్ంచారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రాత్రిపూట దోమతెరలు వాడాలని, ఇంటిలోని తొట్లు, కుండలు, కూలర్లు వారానికి ఒక్కసారైనా శుభ్రం చేసుకోవాలన్నారు. ఏఎన్ఎం సిసింద్రీ, ఆశా కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విత్తనాల పరీక్షలు విరివిగా చేయాలి



శిక్షణ పొందిన ల్యాబ్ సిబ్బందికి సర్టిఫికెట్లు అందిస్తున్న జేడీఏ, తదితరులు

కమలాపురం : రైతులకు సంబంధించిన ఎరువులు, విత్తనాల పరీక్షలను విరివిగా చేయాలని జేడీఏ అయితా నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లకు చెందిన ఏఓలు, ఏఈఓలకు జరుగుతున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన జేడీఏ మాట్లాడుతూ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ సిబ్బంది రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ రైతులకు సంబంధించిన ఎరువులు, విత్తనాల పరీక్షలను ఉచితంగా, విరివిగా చేయాలన్నారు. రైతులు అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లకు వచ్చి పరీక్షలు చేసుకునే విధంగా సూచించాలన్నారు. పరీక్షలు చేయడం ద్వారా ఎరువులు, విత్తనాల నాణ్యత తెలుస్తుందన్నారు. రీజనల్ కోడింగ్ సెంటర్ తిరుపతి డీడీఏ మల్లికార్జున మాట్లాడుతూ ఎరువుల, విత్తనాల పరీక్షలు చేస్తే దేశ, రాష్ట్ర వ్యవసాయ ఉత్పత్తులు తగ్గకుండా ఎప్పటికప్పుడు నివారించడానికి వీలవుతుందన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధించడానికి ఈ శిక్షణలు, మీరు చేసే పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. తాడిపత్రి ల్యాబ్ ఏఓ కిరణ్ మాట్లాడుతూ ల్యాబ్ సిబ్బందికి ఇలా శిక్షణ ఇవ్వడం మంచి శుభ పరిణామం అన్నారు. ఎరువులు, విత్తనాల పరీక్షలు చేయడంలో ల్యాబ్ సిబ్బంది నిష్ణాతులు అయ్యేలా శిక్షణ కార్యక్రమం జరిగిందని ప్రశంసించారు. అయితే అధిక శాతం మంది రైతులకు సంబంధించిన పరీక్షలు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం శిక్షణ పొందిన సిబ్బందికి సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ల్యాబ్ ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

పింఛన్ మూడు నెలలకైనా తీసుకోవచ్చు

కమలాపురం : సామాజిక భద్రత పింఛన్ ఇక నుంచి మూడు మాసాలకొకసారైనా తీసుకోవచ్చని ఎంపీడీఓ జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ నెల పింఛన్ ఆ నెలలోనే తీసుకునే పద్ధతిని ప్రభుత్వం రద్దు చేసిందని, పింఛనర్లు వరుసగా రెండు నెలలు తీసుకోక పోయినా మూడవ నెల మొత్తం పింఛన్ తీసుకోవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆమె తెలిపారు. పింఛనర్లు ఈ విషయం గమనించాలన్నారు.

ఆలయంలో అన్నదానం



భక్తులకు భోజనం వడ్డిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ సమీపంలో ఉన్న శ్రీసత్యసాయిబాబా ఆలయంలో శుక్రవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి హాజరై భక్తులకు భోజనం వడ్డించారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా జన్మదిన వేడుకలలో భాగంగా ఆలయంలో సత్యసాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైఎస్ మనోహర్‌రెడ్డి శ్రీసత్యసాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హాలు గంగాధరరెడ్డి, రసూల్, చంద్రమౌళి, నాగరాజు, సంపత్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగపు నాయకులు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, రాఘవేంద్రారెడ్డి, గంగరాజు, గంగిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

పంటలను నమోదు చేయించుకోవాలి

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : రైతులు వేసుకున్న ప్రతి పంటకు ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలని చింతకొమ్మదిన్నె మండలం వ్యవసాయ అధికారి ఈశ్వర్‌రెడ్డి రైతులను కోరారు. బ్యాంకు లోన్లు తీసుకున్న రైతులు లోను రెన్యువల్ చేసుకుని బ్యాంకు ద్వారానే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. రైతులు స్వయంగా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. రైతు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, వ్యక్తిగత ఫోన్ నెంబరు, వ్యవసాయ, హార్టికల్చర్ అధికారి జారీ చేయు పంట వేసినట్లు సర్టిఫికెట్, కౌలు రైతు అయితే కౌలు కార్డు తీసుకుని వెళ్లి వివరాలు సమగ్రంగా నమోదు చేసుకుని బీమా చెల్లించాలన్నారు. ప్రీమియం చెల్లించిన ప్రతి రైతు కచ్చితంగా పంటను నమోదు చేయించుకుకోవాలన్నారు. వ్యవసాయ, హార్టికల్చర్ సిబ్బంది కూడా తమ పరిధిలోని ప్రతి పంటను నమోదు చేయాలని, ప్రతి పంటకు ఐదు అంకెల కోడు కలిగిన సంఖ్యను కేటాయించి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. రైతుల నుండి కూడా వారు వేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని, గ్రామాలలోని రైతులందరికీ ప్రధానమంత్రి ఫసల్ బీమా గురించి క్షుణ్ణంగా వివరించాలని తెలిపారు.

ఏయే పంటలకు ప్రీమియం మొత్తం, చెల్లించాల్సిన చివరి తేదీ వివరాలు

పంటలు	చెల్లించాల్సిన ప్రీమియం (ఎకరాకు)	ప్రీమియం చెల్లింపునకు చివరి తేదీ
బుడ్డశనగ	480	15.12.2024
మినుము	285	15.12.2024
పెసర	270	15.12.2024
నువ్వులు	180	15.12.2024
వేరుశనగ	480	15.12.2024
జొన్న	315	15.12.2024
పొద్దుతిరుగుడు	300	15.12.2024
వరి	630	31.12.2024

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నిల్వలున్న నీటిలో అబైట్‌ను పిచికారి చేయిస్తున్న సిద్ధయ్య

వేంపల్లె : మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. శుక్రవారం తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజారెడ్డి కాలనీలో ఫ్రైడే – డ్రైడే సందర్భంగా ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నిల్వలున్న నీటిలో అబేట్ పిచికారి చేసి, ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి మూడు సార్లు ల్యాబ్‌కు అందజేయాలన్నారు. ఎవరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించి మలేరియా వచ్చిన వ్యక్తి గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేసి గ్రామంలోని ప్రజలందరికీ రక్తపరీక్షలు చేయాలన్నారు. సీహెచ్ఓ వెంకటరత్నం, ఎంపీహెచ్ఈఓ బాబాఫకృద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీ శంకరమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలకు రుణాలు అందజేత



పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్, సీఓలు

ఎర్రగుంట్ల : స్థానిక ఎస్బీఐ ఆధ్వర్యంలో మెప్మా పొదుపు సంఘాల మహిళలు 18 మందికి ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున బ్యాంక్ రుణాన్ని శుక్రవారం మెప్మా సీఓలు వసంతరెడ్డి, హరితలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ఎస్బీఐ పాయ్, అటల్ పెన్షన్ యోజన బీమా పథకాలపై అవగాహన కల్పించారు. స్వయం సిద్ధ పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏదైన వ్యాపారం చేస్తున్నట్లయితే యూనిట్‌ను బట్టి రూ.లక్ష నుంచి ఐదు లక్షల వరకు రుణాలు మంజురు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్బీఐ మేనేజర్ రామరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణానికి చర్యలు

కడప కల్చరల్ : యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయ అభివృద్ధిలో భాగంగా నూతన భవనం నిర్మాణ పనులను ఆంధ్ర ప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీ ఈ డబ్ల్యూఐడీసీ)కు అప్పగించారు. శుక్రవారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్ గురివిరెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కడప నగరంలోని బ్రౌన్ గ్రంథాలయ ప్రాంగణంలో నిర్మించనున్న ఈ నూతన భవనానికి రూ.3.66 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వారు వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె, చిన్నరంగాపురం, ఎర్రంరెడ్డిపల్లె గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ జేఈ రమేష్ తెలిపారు. పట్టణ ప్రాంతంలోని కోతి సమాధి వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

కొండాపురం : పట్టణ, గ్రామాల్లో బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ నాగప్రసాద్ తెలిపారు. శుక్రవారం వెలుగు సభాభవనంలో ఐసీడీఎస్ ముంతాజ్‌బేగం అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ సచివాలయ మహిళ పోలీసులతో కిశోర వికాసం గ్రామస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. సమాజంలో 11 ఏళ్ల వయస్సు నుంచి 18 ఏళ్ల బాలికల పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కిశోర బాలికల సమస్యలను పరిష్కరించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం లు కీలకంగా వ్యవరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఓబులేసు, రామయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూ, కేరళ క్రైస్ట్ కళాశాల మధ్య ఎంఓయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వైవీయూ, క్రైస్ట్ కళాశాల అధికారులు

వైవీయూ : యోగివేమన విశ్వ విద్యాలయం ఎర్త్ సైన్సెస్ విభాగం, కేరళలోని ఇరింజలగూడ క్రైస్ట్ కాలేజీ(అటానమస్) జియాలజీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ఎర్త్ సైన్సెస్ హెచ్ఓడీ ఆచార్య తుమ్మలకుంట శివప్రతాప్, లక్ష్మీప్రసాద్, క్రైస్ట్ కాలేజీ ఆచార్యులు లింటో అలప్పట్, డాక్టర్ రేష్మి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అకడమిక్‌గా పరిశోధనల పరంగా పరస్పర ప్రయోజనాల కోసం ఈ ఎంఓయూ కుదుర్చుకున్నట్లు వారు తెలిపారు. జియోలాజికల్‌గా కడప బేసిన్ ఎంతో ప్రాధాన్యత కలదని.. తమ విద్యార్థులు పరిశోధనలు, అలాగే సాంకేతిక పరంగా ప్రయోజనాలు పొందుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి సందర్శన, స్ట్రాటిగ్రఫీ, హైడ్రోజియాలజీ, నీటి వనరుల మోడలింగ్‌లపై వైవీయూ, క్రైస్ట్ కళాశాల విద్యార్థులు, పరిశోధకులు పరస్పర అవగాహన పొందుతారని వివరించారు.

తిరునాలకు ముస్తాబైన గురుకుంట ఆలయం



గురిజాల గ్రామ సమీపంలోని గురుకుంట ఆలయం

సింహాద్రిపురం : చుట్టూ పచ్చని పొలాలు, మధ్యలో ఎత్తైన గుట్టపై అనేక ఆలయాల సముదాయాలతో నిండుకున్న ప్రదేశం గురుకుంట ఆలయం. ఎదురుగా నీటితో తొణికిసలాడే కుంట. ఈ కుంటను గురుకుంటగా పిలుస్తారు. ఈనెల 25వ తేదీన కార్తిక చివరి సోమవారం గురుకుంట జన సంద్రాన్నే తలపిస్తుంది. ఈ గుట్టపై పురాతన ఆంజనేయ స్వామి ఆలయంతోపాటు ఇతర చిన్న, చిన్న ఆలయ సముదాయాలు ఉన్నాయి. ఏళ్ల తరబడి జరుగుతూ వస్తున్న తిరునాల వేడుకలకు గురుకుంట ముస్తాబవుతోంది.

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో ఆలయ అభివృద్ధి

మండలంలోని గురిజాల గ్రామ సమీపంలోని గురుకుంట ఆలయం ఆలయ సముదాయాలతో అలరారుతోంది. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఈ ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. ఆలయం చుట్టూ ప్రహరీ గోడ, కమ్యూనిటీ హాలు, అలాగే ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి గురుకుంట మీదుగా తారు రోడ్డుతోపాటు దాతల సహకారంతో కల్యాణ మండపం నిర్మించారు.

గురుతో గురుకుంటగా రూపాంతరం

శతాబ్దాల క్రితం ఇక్కడ ఓ గురువు ఆధ్యాత్మిక జీవితం గడుపుతూ నివసించేవాడని చెబుతారు. అప్పట్లో కేవలం ఆంజనేయస్వామి ఆలయం మాత్రమే ఉండేదట. ఎత్తైన ప్రదేశంలో అక్కడే ఆలయం. ఆలయం ఎదురుగా కొనేటి లాంటి కుంట. గురువు నివసించే ఈ గుట్ట గురుగుట్టగా మారింది. ఆ తర్వాత కాలక్రమంలో కుంట కూడా ఉంది. కాబట్టి గురు కుంటగా మారిందని పూర్వీకులు చెబుతున్నారు.

అయ్యప్ప స్వాములకు నిలయం

కార్తీక మాసంలో అయ్యప్పమాల ధరించిన భక్తులకు గురుకుంట నిలయంగా మారుతోంది. ఆలయాలు అందుబాటులో ఉండటంతో అయ్యప్పమాలదార భక్తులు ఇక్కడ పూజలు చేసుకుంటూ దీక్ష కొనసాగించడం జరుగుతూ వస్తోంది.

తిరునాలకు అన్ని ఏర్పాట్లు

గురుకుంట తిరునాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అలాగే భక్తుల సౌకర్యార్థం పులివెందుల ఆర్టీసీ డిపో వారు ప్రత్యేక బస్సును నడుపుతారు. సింహాద్రిపురం-గురుకుంట, గురిజాల-వెలిదండ్ల మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సులు తిరుగుతుంటాయి. తిరుణాల రోజు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుంది.



గురుకుంట ఆలయంలోని శివుడి మూలవిరాట్



ఆలయంలోని ఆంజనేయస్వామి మూల విరాట్



గురుకుంట కల్యాణ మండపం